క్లుప్తంగా

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించండి



వినతిపత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

దాబాగార్డెన్స్ : తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని అవుట్‌సోర్సింగ్ విధానంలో 15 ఏళ్లకు పైబడి పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమ్ అప్పిలేట్ కమిషనర్ జి. నాగరాజు తరపున జనరల్ సెక్రటరీ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సర్వీసు, విద్యార్హతను పరిగణనలోకి తీసుకుని, మినిమం టైం స్కేల్ ఇప్పించి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సన్నయ్యపాత్రుడు, వాసుదేవరావు, శ్రీనుబాబు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

యాప్ పేరుతో పని ఒత్తిడి తగదు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

సీతమ్మధార : వివిధ రకాల యాప్‌లతో గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర శాఖల్లో లేని విధంగా వైద్య, ఆరోగ్య శాఖలో హెల్త్ సెక్రటరీలు 47 రకాల యాప్‌లు, వాటికి సంబంధించి మరో 70 రకాల ఉప యాప్‌లు ఉపయోగించాల్సి వస్తుందన్నారు. ఇన్ని యాప్‌లపై పని చేయడం వల్ల వారు మానసిక మస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటువంటి సాంకేతిక విధులు నిర్వర్తించేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మణి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్‌వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్‌మోహన్ రావు, రాము, కృష్ణమోహన్, చిట్టిబాబు, దేవకి, రత్నం, పరమేశ్వరి, నిర్మల, టీఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

అరసం జాతీయ మహాసభలకు అప్పలరాజు



సీతంపేట: ఈ నెల 21, 22 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరగనున్న అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలకు రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి, కథా, నాటక రచయిత ఉప్పల అప్పలరాజు హాజరు కానున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానం వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా అరసం ప్రతినిధులు పి.శ్యామ్‌సుందర్, క్షేత్రపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అప్పలరాజుకు అభినందనలు తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

అందరూ మెచ్చేలా..

ప్రజాభీష్టానికే పెద్దపీట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. అభివృద్ధిలో భాగంగా పేదసాదకు ఇబ్బంది లేకుండా సహేతుకమైన చర్యలు తీసుకుంటోంది. వన్‌టౌన్ రహదారిని వంద అడుగుల మేర విస్తరించాలని గత ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. అయితే అంత మేర విస్తరిస్తే తమ దుకాణాలు తొలగింపులో పోయి తమ బతుకులు బజారున పడతాయని అప్పట్లో వ్యాపారులు గగ్గోలు పెట్టారు. కుదింపును పరిమితం చేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వ్యాపారులకు ఎలాంటి నష్టం లేకుండా.. 60 అడుగుల మేర వన్‌టౌన్ రహదారిని విస్తరించాలని నిర్ణయించి పనులు ప్రారంభించడంతో వ్యాపారుల భయాలు తొలగిపోయాయి. తమ భద్రత గురించి ఆలోచించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దుకాణాలను స్వయంగా తొలగించుకుంటున్న వ్యాపారులు

- చురుగ్గా వన్‌టౌన్ రహదారి విస్తరణ పనులు
- ప్రభుత్వం తమ మొర ఆలకించిందంటూ వ్యాపారుల హర్షం
- విస్తరణతో రూపురేఖలు మారనున్న పాతనగరం

జగదాంబ : పాతగనరం రహదారి విస్తరణ అంటే వ్యాపారులు వణికిపోయేవారు. ఎంత మేర విస్తరణ జరుగుతుందో.. తమ వ్యాపారాలకు ఎలాంటి దెబ్బ తగులుతుందో అని ఆందోళనకు గురయ్యేవారు. గత ప్రభుత్వం వంద అడుగుల మేర విస్తరించనున్నట్లు ప్రాతిపాదన చేయటంతో చాలా మంది వ్యాపారులు తమ బతుకులు రోడ్డున పడినట్టుగా భావించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పాతనగరం వ్యాపారుల నెత్తిన పాలు పోసింది. వంద నుంచి ఎనభై అడుగుల మేర విస్తరించాలని తొలుత ప్రాతిపాదనలు తయారు చేసింది. అయితే మరోసారి వ్యాపారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 60 అడుగుల మేర విస్తరణ చేయనుండటంతో వ్యాపారులంతా గుండెలపై చేయి వేసుకుని నిద్రపోతున్నారు. ఇరుగ్గా ఉండే పాతనగరానికి నూతన హంగులు సమకూరనుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జగదాంబ నుంచి చూస్తే వన్ టౌన్ ప్రాంతం కనబడేలా వైఎస్సార్ సీసీ ప్రభుత్వంలో రహదారి అభివృద్ధి జరుగుతోంది. అంతే కాకుండా రహదారికి ఇరువైపులా రూ. 12 కోట్లతో కాలువల నిర్మాణానికి నిధులు విడుదల కావడంతో రహదారి అద్దంలా మెరవనుందని స్థానికులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వన్‌టౌన్‌లో జరుగుతున్న రహదారి విస్తరణ పనులు (ఫైల్)

60 అడుగుల నిర్ణయం మేలు చేసింది..



ముందుగా అనుకున్నట్టు వంద, తర్వాత నిర్ణయించినట్లు 80 అడుగుల మేర రహదారి విస్తరణ జరిగితే మేమంతా రోడ్డున పడేవాళ్లం. మా వ్యాపారాలు దెబ్బ తినేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారుల మేలు కోరి జగనన్న ప్రభుత్వం 60 అడుగులకే విస్తరణ చేయాలని నిర్ణయించడం మేలు చేస్తుంది.

–వెంకటరావు,
పందుపుల్లల సందు భవన యాజమాని

రోడ్డు విశాలంగా మారుతుంది



రోడ్డు విస్తరణతో వన్‌టౌన్ కళకళలాడుతుంది. దుకాణాల తొలగింపుతో రోడ్డు విశాలం అవుతుంది. పనులు పూర్తి అయితే ఈ ప్రాంతం మరింత బాగుంటుంది.

–రాము,
పందుపుల్లల సందు భవన యాజమాని

చిరువ్యాపారులకు అనుకూలంగా..



రోడ్డు విస్తరణ చిరువ్యాపారులకు అనుకూలంగా ఉంది. ఇరుకు రోడ్డు వలన నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటంలేదు. విస్తరణ పనులు పూర్తయితే వ్యాపారులు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి.

–బాబీ,
పూర్ణామార్కెట్ వ్యాపారి

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



ఎటువంటి అభివృద్ధి జరగాలన్నా అది కేవలం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం. ఎన్నో ఏళ్లుగా వ్యాపారులు, జీవీఎంసీ మధ్య సమస్యగా ఉండిపోయిన రహదారి విస్తరణ ఎవరికీ ఇబ్బంది లేకుండా అరవై అడుగులకు కుదించాం.

మహ్మద్ సాధిక్,
39వ వార్డు కార్పొరేటర్

అందరూ స్పందించారు..



వన్‌టౌన్‌లో రోడ్డు విస్తరణ చేయాలనుకున్న చోట 480 మంది వ్యాపారులు దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. వారంతా స్పందించి డాక్యుమెంట్లు సమర్పించి షాపులు తొలగిస్తున్నారు. వారికి నష్టపరిహారం కింద టీడీఆర్‌లు ఇవ్వడానికి జీవీఎంసీ కమిషనర్ సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే నష్టపరిహారం అందిస్తాం.

–వినయ్‌కుమార్,
ఏసీపీ, జీవీఎంసీ జోన్–4

'స్టడీ టూర్‌కు హాజరు కాలేను'

దాబాగార్డెన్స్ : వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో పాటు తాగు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేసేందుకు కార్పొరేటర్ల స్టడీటూర్‌లో తాను భాగస్వామిని కాలేనని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు శుక్రవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

నిస్సహాయ స్థితిలో ఉన్న యువతికి బాసట



నడవలేని స్థితిలో ఉన్న యువతిని తరలిస్తున్న మమత

అల్లిపురం : ఎవరో తెలియదు..ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.. రెండు రోజులుగా రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫారంపై అచేతనురాలిగా పడి వుంది. కదల్లేని స్థితిలో ఉన్న ఆమెను ఆర్‌పీఎఫ్ పోలీసులు గమనించి వివరాలు అడిగినా చెప్పలేకపోయింది. దీంతో వారు మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మమతకు విషయం తెలిపారు. దీంతో ఆమె అక్కడికి చేరుకుని యువతి నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించారు. ఆమె తనది ఒడిసా రాష్ట్రం సమ్మల్‌పూర్ అని, తన పేరు లక్ష్మీ మహానంద్ అని చెప్పింది. గతంలో తనకు యాక్సిడెంట్ కావటంతో తన రెండు కాళ్లు దెబ్బతిన్నాయని, నడవలేని స్థితిలో ఉన్నానని చెప్పడంతో రైల్వే స్టేషన్‌లోని బ్యాటరీ కారు ద్వారా బయటికి తీసుకొచ్చి అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. ఆమె కోలుకున్న తర్వాత షెల్టర్‌లో చేర్చి ఆశ్రయం కల్పించనున్నట్లు మమత తెలిపారు.

చక్కటి ఆరోగ్యంతోనే విద్యలో రాణింపు



నేత్ర వైద్య శిబిరంలో కళ్లను పరీక్షిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది

దాబాగార్డెన్స్ : చదువులో మరింతగా రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ నేతృత్వంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం కళాశాల ఆవరణలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఆరోగ్యంపై జాగ్రత్త వహించినప్పుడే ఏ రంగంలోనైనా ముందుకు సాగిపోవచ్చన్నారు. విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రులకు కూడా ఉచిత వైద్య సేవలందించినట్టు చెప్పారు. నేత్ర వైద్య శిబిరంలో కంటి అద్దాలు అవసరమైన వారందరికీ శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులు కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు అభినందించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ హెచ్ ఆర్ చంద్రశేఖర్, దంత వైద్య నిపుణులు డాక్టర్ శరణీ దీపిక, డాక్టర్ చాందినీ, కళాశాల డీన్ శంకర నారాయణ, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ అర్చనతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల పరమవుతున్న రవాణా రంగం



మాట్లాడుతున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్ : ప్రభుత్వాలు రవాణా రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆరోపించారు. విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ శుక్రవారం సిటు కార్యాలయంలో నిర్వహించారు. డి. అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో జిల్లా నలుమూలల గల 10 రంగాల నుంచి 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నూతన రోడ్డు రవాణా భద్రత చట్టం డ్రైవర్లకు ఉరితాడుగా మారిందన్నారు. ఒకటి, రెండు కార్లున్నవారు తీవ్రంగా దెబ్బతింటున్నారని చెప్పారు. డ్రైవర్లుగా పని చేస్తున్నవారికి వృత్తి, ఉపాధి పోతుందని, విదేశీ కార్పొరేట్ సంస్థలను వ్యతిరేకించాలని, చిన్న యజమానులకు రక్షణ కల్పించాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్ మాట్లాడుతూ జిల్లాలో గల ట్రాన్స్‌పోర్టు కార్మికులందర్నీ ఐక్యం చేసి అక్టోబర్ 5న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని కోరారు. జిల్లా మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బి. జగన్, అధ్యక్షుడిగా కె. శివజగ్గాప్పారావు, ఉపాధ్యక్షులుగా డి. అప్పలరాజు, కె. పోలినాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, కె. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి. అప్పలరాజు, సహాయ కార్యదర్శులుగా ఆర్. చంద్రరావు, సీహెచ్ బాలరాజు, కోశాధికారిగా డి. లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు.

మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ



సర్జరీ అనంతరం కోలుకున్న నరేష్‌తో డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం తదితరులు

ఎంవీపీ కాలనీ: మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన రోబోటిక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన జి.నరేష్ (36) తీవ్ర జ్వరంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కారణంగా ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో చేరాడు. ఆయన్ను పల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తాతే పరీక్షించి క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ (ప్లూరల్ ఎఫ్యూషన్) నీరు ఉందని గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా ఆ నీరును తొలగించాలని సూచిస్తూ రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ చంద్రకు రిఫర్ చేశారు. అనంతరం వీఏటీఎస్(థొరాకోస్కోపిక్) డెకార్టికేషన్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల విస్తరణను నిరోధించే కణజాల పొరతో పాటు ఊపిరితిత్తుల చుట్టూ ఉన్న నీరును తొలగించారు. శరీరంపై 5–6 సెంటీమీటర్ల చిన్నపాటి రంధ్రం ద్వారా సున్నితమైన ఈ సర్జరీని డాక్టర్ కార్తీక్ చంద్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోగి వేగంగా కోలుకుని, 4 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చంద్ర బృందాన్ని ఆస్పత్రి వర్గాలు అభినందించాయి.

దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ (క్లరికల్) అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫైజర్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్ లైన్స్, వింధ్యా ఇ– ఇన్ఫోమీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 457 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 253 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. వారిలో 64 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందించారు. ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీ లత జాబ్‌మేళాలో అభ్యర్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తితో ఉన్నత శిఖరాలకు..



హెచ్‌ఎం శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం: విద్యార్థులు మేధాశక్తిని పెంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. హైస్కూల్‌లో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయి నారీ శాఖల సంయుక్తంగా వికాస్ సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలతోకూడిన విద్యా సామగ్రిని అందజేశారు. ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకుని సంస్కారవంతులుగా ఎదగాలన్నారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాసరావును సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, రఘువీర్, నాగేశ్వరరావు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గీతాలాపన

సీతంపేట: రాగమాలిక సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు మీనాకుమారి, ఆదిలక్ష్మి, ఇందిరా సాహిని, శైలజ, శ్వేత, సుబ్బారావు, పార్థసారథి, భరద్వాజ్, రాజు, చింతపల్లి సత్యనారాయణ, ఆనందరావు అలనాటి మేటి గీతాలను ఆలపించి అలరించారు. ముందుగా ఇటీవల పరమపదించిన జానపద ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా సద్భావనా దివస్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో సద్భావనా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ అధికారులు, సిబ్బంది చేత సద్భావనా ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఆగస్టు 20న సద్భావనా దివస్‌గా పాటిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీ ఆదివారం కావడంతో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. రాజీవ్ జయంతిని దేశ ప్రజల మధ్య జాతీయ సమైక్య, శాంతి, సామాజిక సమానత్వం, ఐక్యతలకు గుర్తుగా అవలంబిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుదీర్‌కుమార్ గుప్తా, ఇతర బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్ర జలాల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: సముద్ర జలాల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాల జంతు శాస్త్ర విభాగం, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సముద్ర కాలుష్యం వలన జల జీవరాశులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి మనుగడకు, జల కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా విభాగాధిపతి డి.భూమిరెడ్డి మాట్లాడుతూ సముద్ర జలాల పరిరక్షణ బాధ్యత విద్యార్థులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగం అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, శ్రావణ్‌కుమార్, రవిబాబు, శ్యామ్యూల్ డేవిడ్‌రాజు, రామారావు, శాంతి ప్రభలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



అచ్చియ్యమ్మపేట ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కేజీహెచ్ ఓపీ గేటు వద్ద ఆటో స్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : కేజీహెచ్ మెయిన్‌గేటు అభివృద్ధిలో భాగంగా ఆటో స్టాండ్ తొలగిస్తున్నారని ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. 36వ వార్డు జామియా మసీదు వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడారు. వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టీ మీసాల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముజీబ్‌ఖాన్, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

అచ్చియ్యమ్మపేటలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కొబ్బరితోటలో వాటర్ సప్లై టైమింగ్ మార్చాలని ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన వాటర్ సప్లై ఈఈతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, లండా రమణ, బాపు ఆనంద్, ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, వద్దాది దిలీప్, బోణి దేవ, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు, తాతబ్బాయి, బొర్రా శ్రీనివాసరెడ్డి, బొడ్డేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం



మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మద్దిలపాలెం : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ పుట్టా రాజేంద్ర ప్రసాద్ కుటుంబానికి సహచర కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.1.68 లక్షలు ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల నుంచి రూ.1.18 లక్షలు, మృతుడు పనిచేసిన పెందుర్తి ఆరోగ్యకేంద్రం సిబ్బంది రూ.40 వేలు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.10 వేలు సేకరించి ఆ మొత్తాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అకస్మాత్తుగా మరణించిన తమ సహచరుని కుటుంబానికి అండగా నిలిచిన సిబ్బంది తీరును అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఏ కష్టమొచ్చినా సాయం చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవిశంకర్, నగర అధ్యక్షుడు నారాయణరావు, కోశాధికారి ఏవీఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, జిల్లా సంయుక్త కార్యదర్శి నరం నాయుడు, పెందుర్తి సీహెచ్‌వో స్వర్ణలత, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు పేరినాయుడు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఛాయా చిత్ర ప్రదర్శన

ఏయూక్యాంపస్: వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సంయుక్తంగా శని, ఆదివారాలలో ఛాయాచిత్ర (ఫోటో) ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పెదవాల్తేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రదర్శనను శనివారం ఉదయం స్టీల్ ప్లాంట్ ఉక్కు హౌస్ సమావేశ మందిరంలో సీఎండీ అతుల్ భట్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలో 1940 నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న వివిధ పురాతన కెమెరాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రములో సీనియర్ ఫొటో జర్నలిస్టు సీవీ సుబ్రహ్మణ్యానికి డా.పిల్లా రాజారావు(వాసు) జీవిత సాఫల్య పురస్కారం, సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్‌వీవీఎస్ ప్రసాద్‌కు బండి వెంకట రమణ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందిస్తామన్నారు. జూలై 21, 22, 23 తేదీల్లో అరకులో నిర్వహించిన ఫొటో వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారి ఫొటోల్లో ఉత్తమమైన వాటిని ఎంపికచేసి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.